## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్బన్, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

**96665 56646**



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం, జనవరి 12, 2026 | పేజీలు: 7





## సొసైటీలకు ఇక నామినేటెడ్
# పాలక వర్గాలు?

- వ్యవసాయ మార్కెట్ కమిటీల తరహాలో నియామకాలు
- సొసైటీల్లో సభ్యత్వం ఉన్న రైతులకు మాత్రమే అవకాశం
- కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకుల్లో చిగురిస్తున్న ఆశలు
- జిల్లా నాయకుల మద్దతు కూడగట్టుకునే యత్నం

**నాగిరెడ్డిపేట్(ఎల్లారెడ్డి)జనవరి11(ప్రజాజ్యోతి);**
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఇక నామినేటెడ్ ప్రతిపాదికన ఎన్నికుంటారనే చర్చ కోనసాగుతోంది. ఇప్పటివరకు ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా ఇటీవల ఆయా పాలకవర్గాలను రద్దు చేస్తూ ప్రభుత్వం

-మిగతా 2లో..




## కలెక్టరేట్‌లో ఘనంగా వడ్డె
# ఓబన్న జయంతి



**కామారెడ్డి ప్రతినిధి జనవరి 11. (ప్రజాజ్యోతి)**
స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని వక్తలు కీర్తించారు. ఆ మహనీయుని జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ ఆయా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న ఆనాడు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జరిపిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. వడ్డె ఓబన్న ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ.సీ సంక్షేమ శాఖ అధికారి జయరాజ్, సహాయ సంక్షేమ అధికారి చక్రధర్, ఒడ్డెర సంఘ నాయకులు ఎల్లయ్య , శ్రీనివాస్, ఆయా సంఘాల ప్రతినిధులు కొత్తపల్లి మల్లయ్య, నాగభూషణం, నరేశ్ ,పవన్, స్వామి, అశ్వాక్ , శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాలు, పేకాటపై
# కఠిన చర్యలు

పోలీస్ కమిషనర్ హెచ్చరిక




2 లో

## డ్వాక్రా మహిళలకు
# ప్రభుత్వం పెద్ద పీఠ

## అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి కాసుల బాలరాజు



**బాన్సువాడ ఆర్ సి జనవరి 11 (ప్రజా జ్యోతి)**

బాన్సువాడ పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని తమ చేతుల మీదుగా ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఆగ్రో ఇంట్రెస్ట్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు బాన్సువాడ పట్టణ శివారులోని బోర్లం రోడ్డు పక్కన 20 లక్షల రూపాయలతో ( ఎస్ డి ఎఫ్ నిధులు ) వారాల సంఘం భవన నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు.

-మిగతా 2లో..

## సొసైటీలకు ఇక నామినేటెడ్

# పాలక వర్గాలు?

ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. గతంలో ఈ సంఘాలకు ఎన్నికలు జరిగాక సొసైటీ చైర్మన్లు, సభ్యులతో పాలకవర్గం ఏర్పడేది.జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఏసీఎస్‌ల చైర్మన్లు,డీసీసీబీకి చైర్మన్,పాలకవర్గాన్ని ఎన్నికల విధానంలో ఎన్నుకునేవారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సహకార సొసైటీల పదవులను నామినేటెడ్ చేసే యోచనలో ఉన్నట్లు తెలియడంతో నాయకులు ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీ అయ్యారు .గ్రామీణ స్థాయిలో డిమాండ్ ఉన్న పదవి కావడంతో సహకార ఎన్నికలు హోరాహోరిగా సాగేవి. కానీ ప్రస్తుతం పదవులను నామినేట్ చేస్తారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్‌లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల్లో కొత్త ఆశలు చిగురించాయి. హైదరాబాద్ దారి పట్టిన నాయకులు తమ పేర్లు నామినేట్ చేయాలని కోరుతున్నారు. కాగా సహకార సంఘాల పాలక వర్గాలు, డీసీసీసీబి, డీసీఎంఎస్ పాలక వర్గాలను నామినేటెడ్ విధానంలో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో కీలకమైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (సొసైటీలకు) పదవుల కోసం అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికే గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ, ఆర్థిక అంశాలతో ముడి పడి ఉన్న ఈ సహకార సం ఘాల పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీంతో సహకార ఎన్నికల్లో సైతం సాధారణ ఎన్నికల మాదిరిగా హోరాహోరీగా ఎన్నికలు జరుగుతాయి. ఈ సహకార పాలక వర్గ పదవు లను నామినేటెడ్ పదవుల్లో భర్తీ చేయను న్నట్లు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చ కొనసాగుతోంది. ఈ పదవులను దక్కించుకునేందుకు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఎవరికి వారుగా ఉన్నప్పటికీ భారీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పదవులు దక్కించు కునేందుకు గ్రామాల్లోని పలువురు అధికార పార్టీ నాయకులు పలుమార్లు హైదరాబాదుకు వెళ్లి జిల్లాకు చెందిన కీలక నేతలను కలుస్తున్నారు. సహకార పదవుల్లో తమను నామినేట్ చేయించేలా చూడాలని కోరుతున్నారు.

### గతంలో సొసైటీల పాలక మండళ్లు!

గతంలో ప్రతి సొసైటీకి 13 మందితో పాలక వర్గం ఏర్పాటు చేయాలి. ఇందులో చైర్మన్, వైస్ చైర్మన్, 11 మంది డైరెక్టర్లు ఉంటారు. డైరెక్టర్ల నియామకంలో రిజర్వేషన్లు కూడా పాటిస్తారు. ఎస్సీ మహిళ, ఎస్టీ జనరల్, బీసీ జనరల్ కేటగిరీలకు మూడు డైరెక్టర్ పోస్టులు ఇస్తారు. మిగిలిన 10 మంది డైరెక్టర్లను జనరల్ కేటగిరీలో భర్తీ చేయాల్సి ఉంటుంది.మరి ఇప్పుడు ఎలా చేస్తారో అని దింట్లో రైతుల ప్రా బల్యం తగ్గి రాజకీయ నాయకుల ప్రా బల్యం పెరుగుతుందని పల్లెలో ఆందోళన వ్యక్తం అవుతున్నాయి.ఓటు ద్వారా ఎన్నికైనప్పుడు పాలకవర్గాలు రైతులకు జవాబుదారీగా ఉండేవారని, నామినేటెడ్ పద్ధతి వస్తే ఆ పరిస్థితి ఉండదని రైతులు చర్చించుకుంటున్నారు. అయితే పిఏసిఎస్ లో సభ్యులుగా ఉన్న వారితో మాత్రమే పాలక వర్గాలను ఏర్పాటు చేయాలని, సభ్యత్వం లేని వారికి అవకాశం ఇవ్వకూడదని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.

### వ్యవసాయ మార్కెట్ కమిటీల తరహాలోనే..

వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల పాలక వర్గాలను నామినేటెడ్ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ఆ ప్రజాప్రతినిధులే మార్కెట్ కమిటీలకు ప్రతిపాదనలు ఇస్తారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇచ్చే జాబితానే రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి పరిగణనలోకి తీసుకొని కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఇందులో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకే అవకాశం కల్పిస్తారు. ఆయా మండలాలు, నియోజకవర్గాల్లోని ద్వితీయ శ్రేణి నాయకులకు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులు నామినేషన్ పద్ధతిలో ఇస్తారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాని వారికి, వచ్చినా ఓడిపోయిన వారికి, ఎమ్మెల్యేలకు సన్నిహితంగా ఉండే వారికి, సామాజిక వర్గాల సమీకరణలను పాటిస్తూ మార్కెట్ కమిటీ పాలక వర్గాల్లో అవకాశం కల్పిస్తారు. ఇదే పద్ధతిలో పిఏసిఎస్ లో పాలక వర్గాలను నామినేట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జిల సిఫారసు మేరకు పాలక వర్గాలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

## డ్వాక్రా మహిళలకు

# ప్రభుత్వం పెద్ద పీఠ





అనంతరం పాత బాన్సువాడ చావడి వద్ద 15 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన చావిడి భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పాత బాన్సువాడలో హనుమాన్ ఫంక్షన్ హాల్లో డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోచారం పాల్గొని మహిళలతో మాట్లాడుతూ

రాష్ట్ర డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తోంది, చాలా ప్రాధాన్యం ఇస్తోంది, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందనీ. ఈక్రమంలోనే వారికి పలు రకాల ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు.ఇప్పటికే ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు డ్వాక్రా సంఘాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. డ్వాక్రా మహిళలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందాలని తెలిపారు .ఈ కార్యక్రమాలలో బాన్సువాడ పట్టణ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ సెలవులకు ఊరు వెళ్లేవారు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలి

### పౌరులకు కీలక సూచనలు జారీ చేసిన ఎస్ ఐ.చంద్రమోహన్.

**రెంజల్, జనవరి, 11(ప్రజా జ్యోతి):**

సంక్రాంతి పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు స్వగ్రామాలకు ప్రయాణిస్తున్న నేపథ్యంలో, దొంగతనాలు మరియు నేరాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెంజల్ ఎస్ ఐ చంద్రమోహన్ సూచించారు. ఈ సందర్భంగా ఇంటి భద్రత, వ్యక్తిగత రక్షణకు సంబంధించిన పలు కీలక నిబంధనలను వెల్లడించారు. పండుగకు ఊరు వెళ్లేవారు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు:ఊరు వెళ్లేటప్పుడు నగదు, బంగారం వంటి ఖరీదైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లో భద్రపరచాలి.ఊరు వెళ్తున్నామన్న విషయాన్ని సోషల్ మీడియా పోస్టులు, స్టేటస్‌ల ద్వారా వెల్లడించకూడదు.ఇంటి తలుపులకు బలమైన తాళాలు లేదా సెంట్రల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి.తాళం వేసి ఊరు వెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వారు వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించాలి.అపరిచిత వ్యక్తులు కాలనీలో తిరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.శివారు ప్రాంత కాలనీల్లో తాళం వేసిన ఇండ్లను ఉదయం గమనించడం, రాత్రివేళ దొంగతనాలకు పాల్పడే అనుమానితులపై నిఘా ఉంచాలి.ఇరుగు పొరుగు వారిని ఇంటిపై కన్ను వేసి ఉంచమని కోరాలి.పక్కింటి వారి ద్వారా ఇంటి పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం మంచిది.ఇంట్లో మహిళలు, వృద్ధులు మాత్రమే ఉన్నప్పుడు “సమాచారం”, “సర్వే” పేరుతో వచ్చే అపరిచితులను నమ్మరాదు.కాలనీల వారిగా స్వచ్ఛందంగా “గస్తీ బృందాలు” ఏర్పాటు చేసుకోవాలి.దొంగతనాలకు పాల్పడే అనుమానితుల సమాచారం పోలీస్ శాఖకు అందించి నేర నివారణకు సహకరించాలి.



అత్యవసర సమాచారం:

ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి లేదా డయల్ 100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ప్రజలను కోరారు.ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని, పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా సుదర్శన్ నాయక్

**ఇందల్వాయి జనవరి 11 ( ప్రజా జ్యోతి న్యూస్ )**

ఇందల్వాయి మండల సర్పంచుల పోరమ్ మండల అధ్యక్షులుగా ఇందల్వాయి తండాకు చెందిన బాధావత్ సుదర్శన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నూతన కమిటీని సర్పంచులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఉపాధ్యక్షులుగా ఎత్తు తాండాకు చెందిన గణేష్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా పడాల రోహిత్ గౌడ్ (డోనకల్ సర్పంచ్) ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు, సర్పంచ్ లా పోరానికి నూతనంగా నియామకమైన సుదర్శన్ నాయక్ మాట్లాడుతూ సర్పంచ్ల సమస్యల పట్ల నిరంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో కృషి చేస్తానన్నారు, ఎంతో విలువైన సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చినందుకు మండల సర్పంచులకు రుణపడి ఉంటారని ఈ సందర్భంగా ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు చింతల కిషన్. కరణం శ్రీనివాస్. వనిత కుమార్, శిరీష మైపాల్ నాయక్, లోకని గంగామణి గంగారం, లావుడియా మీనా భాయ్ గంగాధర్, భారతి జగత్ సింగ్ పవర్, బంతిలాల్, హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు



## కోడిపందాలు, పేకాటపై

# కఠిన చర్యలు

నిజామాబాద్ రూరల్: జనవరి, 11 (ప్రజా జ్యోతి)

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోడిపందాలు, పేకాట, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ హెచ్చరించారు.

నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసి, నిరంతర వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన ప్రదేశాల్లో గస్తీని మరింత ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

మహారాష్ట్ర--నిజామాబాద్ సరిహద్దు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పేకాట, కోడిపందాలు లేదా ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటూ పట్టుబడిన నిందితులపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలపై సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు తెలియజేయాలని కమిషనర్ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు.

# కేరళ శబరిమల చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆహ్వానానికి స్పందించిన సీతాలే రమేష్

**బాన్సువాడ ఆర్ సిజనవరి 12 (ప్రజా జ్యోతి)**

కేరళ రాష్ట్రం శబరిమలలో అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా బీర్కూర్, పోతంగల్‌కు చెందిన డా. సీతాలే రమేష్ తన మిత్రులతో కలిసి హాజరై సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ తరపున మూడున్నర క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించి చిన్ముద్ర సేవా ట్రస్ట్ నిర్వహిస్తున్న అన్నదాన సత్రానికి అందజేశారు. అంతేకాకుండా అన్నదాన కార్యక్రమానికి ఉపయోగపడే విధంగా 300 గ్లాసులను కూడా విరాళంగా అందించడం విశేషం. డా. సీతాలే రమేష్ చేసిన ఈ సేవా కార్యక్రమానికి చిన్ముద్ర సేవా ట్రస్ట్ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. హరిహర సుతుడు అయ్యప్ప స్వామి ఆశీర్వాదంతో రమేష్ ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు డా. సీతాలే రమేష్‌ను మనస్ఫూర్తిగా అభినందించారు. సమాజ సేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు ఈ కార్యక్రమం మరో ఉదాహరణగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.



# చత్రపతి టీచర్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక



**సదాశివనగర్ జనవరి 11 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి జిల్లాలోని చత్రపతి టీచర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షులుగా లోకోటి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి కత్మండి మధు, కోశాధికారి గడ్డమీద కమలాకర్ రావు కోఆర్డినేటర్ లు గా వాడి కాడి కృష్ణాఖర్, పెద్ద బీర కృష్ణమూర్తి, కృష్ణాజిగారి రవిలను ఎన్నుకున్నారు.

# బీర్కూరు మున్నూరు కాపు యువత ఆధ్వర్యంలో సన్మానం.





**బాన్సువాడ/బీర్కూర్ ఆర్ సి జనవరి 11(ప్రజా జ్యోతి)**

కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం కేంద్రంలో మున్నూరు కాపు సంఘ భవనంలో మున్నూరు కాపు యువత బీర్కూర్ మున్నూరు కాపు తరపున గెలిచిన యువనేత సర్పంచ్ ధర్మ తేజ వార్డు సభ్యులు మద్నూర్ కవిత, అరిగే భాస్కర్, మేకల రాహుల్, ఆకుల నవీన్, అరిగే గాయత్రి లకు శాలువాలతో, పూల మాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా అరిగే ధర్మ తేజ మాట్లాడుతూ మున్నూరు కాపు లు రాజకీయం గా ఎదగాలని పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపు బీసీ సామాజిక వర్గం అతి పెద్దగా ఉన్నప్పటికీ చట్టసభలో మున్నూరు కాపులకు కావాల్సిన అన్ని సీట్లు కేటాయించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్నూరు కాపుల్లో రాజకీయ చైతన్యం ఇంకా పెరగాలని ప్రతి విషయంలో మున్నూరు కాపులు అండగా ఉండాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జరిగిన ఫలితాల్లో గ్రామ సర్పంచ్ గా మున్నూరుకాపు యువనేత ధర్మతేజ బీర్కూరు ప్రజలు పట్టాం కట్టారు, తాను ఒక మున్నూరు కాపు సామాజిక వర్గానికి కాకుండా గ్రామంలోని అన్ని కులాలకు సరి సమానంగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత తన భుజాస్కందాలపై ఉందని ధర్మతేజ వెల్లడించారు, ఇంత పెద్ద గ్రామ పంచాయతీకి యువకుడినైనా తాను గ్రామ సర్పంచ్ గా బీర్కూర్ ప్రజలు పట్టం కట్టినందుకు వారి రుణం తీర్చుకుంటామని అవసరమైతే అధికార పార్టీ గ్రామ అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుల సలహాలు సూచనలు తీసుకుంటూ స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో బీర్కూర్ గ్రామాన్ని ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దడానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. తనను గ్రామ సర్పంచ్ గా గెలిపించిన ఓటర్లకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామ అభివృద్ధికి సైనికుడిలా సర్పంచ్ కృషి



**రాజంపేట జనవరి 11(ప్రజా జ్యోతి)**

గ్రామ అభివృద్ధే నా లక్ష్యం, ప్రజల ఆరోగ్యమే నా ప్రధాన బాధ్యత అంటూ రాజంపేట మండల కేంద్రంలో సర్పంచ్ దుబ్బ శ్రీకాంత్ సైనికుడిలా ముందుండి పారిశుద్ధ్య పనులను నడిపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు ఉదయం 7 గంటలకే ప్రారంభమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, మురికి కాల్వల పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులను ముమ్మరంగా చేపట్టారు. ఆదివారం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సర్పంచ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. ప్రజల ఆరోగ్యం కాపాడడమే తన లక్ష్యమని, గ్రామ అభివృద్ధిలో తాను సైనికుడిలా ముందుండి నడిపిస్తానని ప్రజా జ్యోతి దినపత్రికతో సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీర్ ఇమ్రాన్ అలీ, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రోజీవాడి నూతన పాలకవర్గానికి అపూర్వ గౌరవం

## గ్రామ సంఘం సభ్యులు వో బి సిఏల సభ్యుల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం

**కామారెడ్డి రూరల్ జనవరి 11 ప్రజా జ్యోతి**

కామారెడ్డి మండలంలోని ఇస్రోజీవాడి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులకు గ్రామ సంఘం ఓవో బి సభ్యులు సిఏ లు ఘనంగా సన్మానించారు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ చిందం మల్లేష్ ఉప సర్పంచ్ సిద్ధం స్వామి వార్డు సభ్యులు షేక్ అజిత్ మల్లీ మనవ మోహన్ రావు సంతోష్ లక్ష్మి బాలమణి సావిత్రి నవీన్ ప్రణీత్ లను శాలువులతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు ప్రజల ఆశీర్వాదంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరుతూ గ్రామ సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించడం విశేషం గ్రామ పరిపాలన సాగేందుకు వారి సేవలు అమూల్యమని గ్రామ సంఘం నాయకులు ప్రశంసించారు ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం సి సి గంగారెడ్డిగ్రామ సంఘ వో బి వివోఏలు శివకుమార్ భాగ్యలక్ష్మి గ్రామ సంఘం అధ్యక్షులు కవిత శోభ రాణి నిలవ సుకన్య వాణి తదితరులు పాల్గొన్నారు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరై నూతన పాలకవర్గానికి మద్దతు ప్రకటించారు సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ చిందం మల్లేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నమ్మకాన్ని వృధా చేయకుండా అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు తాగునీరు రోడ్లు పారిశుద్ధం విద్య ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి ఇస్రోజీవాడి నీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు ఉప సర్పంచ్ సిద్ధం స్వామి మాట్లాడుతూ పాలకవర్గం సమిష్టిగా పనిచేసే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు గ్రామ సంఘం సభ్యులు మాట్లాడుతూ నూతనా పాలకవర్గంతో సమన్వయం చేసుకొని గ్రామ సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని వారు తెలిపారు ఈ సన్మాన కార్యక్రమం గ్రామంలో పండగ వాతావరణాన్ని తలపిస్తూ అంగరంగ వైభవంగా జరిగింది



# భగత్ సింగ్ సిండికేట్ నూతన కార్యవర్గం ఎన్నిక

**కామారెడ్డి ప్రతినిధి జనవరి 11. (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి భగత్ సింగ్ నగర్ కాలనీలో ఆదివారం నూతన భగత్ సింగ్ సిండికేట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.ప్రభుదేవ్, గౌరవ అధ్యక్షుడు కాసర్ల స్వామి, కార్యదర్శి దేవసేన పటేల్, ఉపాధ్యక్షుడు పి. ప్రభాకర్ రెడ్డి, క్యాషియర్ ఉపేందర్, సలహాదారులు గోవిందరావు, నీలం రాజలింగం, కే. శ్రీకాంత్, శ్రీనివాస్, నరేందర్ రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారు కాలనీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ సభ్యులు పాల్గొన్నారు.



# యువత భవిష్యత్తు కోసం క్రీడా ప్రాంగణం పరిశుభ్రం

**రాజంపేట జనవరి 11 (ప్రజా జ్యోతి)**
రాజంపేట మండలంలోని పెద్దాయిపల్లి గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురై చెత్తాచెదారంతో నిండిపోయిన క్రీడా ప్రాంగణాన్ని నేడు సర్పంచ్ కమిహెట్టి నరేష్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా మార్చారు. గత పాలకుల పాలనలో క్రీడా ప్రాంగణ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో అక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం వ్యాపించేది. ఆదివారం ప్రత్యేకంగా చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా, సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి యువత క్రీడలు ఆడుకునేలా ప్రాంగణాన్ని సక్రమంగా సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, యువతకు క్రీడా వసతులు కల్పించడమే ఉద్దేశంగా ఈ పరిశుభ్రత పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలోని బడి, గుడి, క్రీడా ప్రాంగణం అనే తేడా లేకుండా గత పాలకులు వదిలేసిన అభివృద్ధి పనులను తాను స్వయంగా పర్యవేక్షిస్తూ ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. వార్డుల్లో ఏ సమస్య తన దృష్టికి



వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం





**రామారెడ్డి జనవరి 11 (ప్రజా జ్యోతి)**
రామారెడ్డి మండలం ఈసన్న పల్లి గ్రామంలో ఇరువురు ఈ మధ్యకాలంలో మృతి చెందారు. గుండెపోటుతో ఎర్ర బాబు, బుద్ధ భాస్కర్ కుమారుడు రుతిక్ ఈమధ్యనే అకాల మరణం చెందారు. కనుక వారి బాధిత కుటుంబాలకు మానవత దృక్పథంతో తమ వంతు సహాయంగా ఒక్కొక్కరికి 3000/- ,3000/-ఆర్థిక సహాయం అందించారు అదేవిధంగా ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు. చేశారు. ఈ యొక్క చిన్న సహాయం డబ్బు కంటే ముందు మనసుతో చేసిన సహాయం. వారి కన్నీళ్లను పూర్తిగా తుడిచేయ లేకపోయినా, ఈ కష్ట సమయంలో వారు ఒంటరిగా లేరని తెలియజేయాలనే మా ఆలోచనతో చేస్తున్న చిన్న ప్రయత్నం అని తెలిపారు.

# ఆర్య క్షత్రియ సంఘం నూతన అధ్యక్షుడికి అభినందనలు

**రాజంపేట జనవరి 11 (ప్రజా జ్యోతి)**
దేవునిపల్లి నూతన ఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణారావు ఎన్నికైన సందర్భంగా ఆదివారం అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండలం ఆరేపల్లి గ్రామ నూతన సర్పంచ్ పాల్లె రోజా కృష్ణారావు, మోతే గ్రామ నూతన సర్పంచ్ సుజాత అశోకరావు, కామారెడ్డి పట్టణ 12వ వార్డు చిన్నుల రజనీకాంత్ రావు, మోతే శ్రీనివాస్‌తో పాటు పలువురు సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామకృష్ణారావును నూతనంగా ఎన్నికైన సర్పంచులు శాలువాతో సత్కరించి, పూలగుచ్చాలు అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి సమిష్టిగా కృషి చేయాలని వక్తలు ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన



రామకృష్ణారావు మాట్లాడుతూ, ఆర్య క్షత్రియ సంఘం అభివృద్ధి, ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# దశలవారీగా అభివృద్ధి పనులు



**బిక్కనూరు,జనవరి 11 (ప్రజా జ్యోతి)**
భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామ సర్పంచ్ కోడూరి సాయి గౌడ్, ఉప సర్పంచ్ చైతన్య రెడ్డి గ్రామ అభివృద్ధిలో భాగంగా7వ వార్డు పరిధి లో తౌడనుకుంటా దగ్గర సింగిల్ ఫేస్ మోటార్ బిగించడం జరిగింది. అదేవిధంగా 10వ వార్డు పరిధిలో ఉన్న మోటార్లు రిపేరు చేయించి బిగించారు. గ్రామంలో ఎక్కడ కూడా నీటి కొరత ఉండకూడదు అనే సంకల్పంతో అన్నిచోట్ల నీటి వసతులను సమకూరుస్తూ, దశలవారీగా అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తున్నట్టుగా సర్పంచ్ కోడూరు సాయి గౌడ్ తెలిపాడు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్‌కి సన్మానం

**-రెండుసార్లు వార్డు మెంబర్‌గా సేవలను మెచ్చి ఉపసర్పంచ్ పదవి**



**భిక్కనూరు జనవరి 11 (ప్రజాజ్యోతి)**
భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన ఆస రమేష్ బిఆర్ఎస్ పార్టీ తరపున రెండుసార్లు వార్డు మెంబర్ గా గెలిచి, రాజకీయాల్లో చురుకుగా ఉంటూ, గ్రామ అభివృద్ధిలో తనవంతు కృషిని అందించాడు. అతని సేవలను గుర్తించి వార్డు మెంబర్ గా గెలిపించడమే కాకుండా, ఉపసర్పంచ్ పదవిని కూడా కట్టబెట్టారు. ఈ సందర్భంగా కామారెడ్డి అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సంఘ సభ్యులు అందరూ కలిసి కంచర్ల గ్రామానికి విచ్చేసి ఉప సర్పంచ్ ఆస రమేష్ ను ఘనంగా సన్మానించారు.

## ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు



**సదాశివనగర్ జనవరి 11 (ప్రజాజ్యోతి)**
సదాశివనగర్ మండలంలోని పద్మాజీ వాడి ఎక్స్ రోడ్లో వడ్డెర ఓబన్న 219వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదాశివనగర్ మండల అధ్యక్షులు ర్యాపని సహేందర్ మాట్లాడుతూ.. వడ్డెర ఓబన్న జీవితం న్యాయం ధైర్యం, త్యాగానికి ప్రతీక అని అన్నారు. సామాజిక అణిచివేతకు, అక్రమాలకు ఎదిరించి నిలిచిన పోరాట యోధినిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయడం యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఈ జయంతి వేడుకల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డే రమేష్, దండవుల సాయిలు, సంతోష్, శ్రీకాంత్, అశోక్, సందీప్, నాగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

**-ఈసన్నపల్లి సర్పంచ్ దోకి లచ్చయ్య**

**రామారెడ్డి జనవరి 11 (ప్రజా జ్యోతి)**
ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కురుమ సంఘం నాయకులు సర్పంచులు, ఉపసర్పంచ్ లు, వార్డ్ మెంబర్ లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జిల్లా కురుమ సంఘం తరపున ఆదివారం ఘనంగా ఈసన్నపల్లి గ్రామ సర్పంచ్ గా విజయం పొందిన ధోకి లచ్చయ్యకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఇదేవిధంగా కురుమ నాయకులు అన్ని రంగాలలో రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశించి మాట్లాడారు.



# మనం సాధిస్తున్నప్రగతి ఇదేనా..?



## డా.పోలం సైదులు

**రామారెడ్డి జనవరి 11 (ప్రజా జ్యోతి)**

పరిణామక్రమంలోభాగంగా ప్రకృతితో సహజీవనం నుండి యాంత్రికజీవనం వరకు,మానవత్వం నుండి స్వార్థం,వరకు,దావఖానలు లేని కాలంనుండి అవి లేకుంటే మనిషి బ్రతకలేని పరిస్థితి,వరకు,మానవజీవితం సగటున వందనుండి అరవై ఏళ్ళవరకు,ఉమ్మడి కుటుంబాలనుండి వ్యష్టి కుటుంబాలవరకు పరిణితి చెందుతూ,నేటి ఈ సమాజంలో దారిద్ర్యరేఖకు దిగువునున్న వారిసంఖ్య క్రమంగాపెరుగుతూ,శాస్త్ర,సాంకేతికరంగాలలో అభివృద్ధి శరవేగంతో పరుగులుపెడుతునప్పటికి పేదవాడి కడుపును మాత్రంనింపలేకపోతున్నదన్నది,నిజం.ప్రస్తుతసమాజంలో ధనవంతుడు ఇంకా ధనవంతుడు అవుతున్నాడే తప్పా ! పేదవాడుమాత్రం ఆ అదృష్టాన్ని నోచుకోలేక మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నాడన్నది ముమ్మాటికీ వాస్తవం.

**అత్యధికశాతం ప్రజలు..!**

వ్యవసాయరంగంపై ఆధారపడి,ఎలాంటి కృత్రిమ రసాయనిక ఎరువులు వాడకుండా ఆహారపంటలనే పండిస్తూ ఎంతో ఆరోగ్యాంగా ఉండేవారు.కానీ నేడు సాధిస్తున్న ప్రగతిలోభాగంగా వివిధ కార్పొరేటుసంస్థలు వ్యవసాయంపైన వ్యాపారంచేయడం మెదలుపెట్టి అధికలాభాలను పొందడానికి,చల్లని బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి,వివిధరకాల పద్ధతులతో కూలీలనుపయోగించుకుంటూ అన్నిరకాల ఆహారపదార్థాలను పండిస్తూ,అధికధరలకు అమ్ముతున్నారు.ప్రస్తుతపరిస్థితులలో గ్రామాలలోనున్న సన్నకారు రైతులుకూడా వారికున్న ఒకటిరెండు ఎకరాలలో ఆహారపంటలను గాకుండా వాణిజ్యపంటలు పండించడానికే ఎక్కువ మక్కువ చూపుతున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.

అయినప్పటికీ వారికీ లాభాలురాకపోగా నష్టాలఊబిలో చిక్కుకోని రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలను వివిధ మధ్యమాలలో అప్పుడప్పుడు చూస్తూనే ఉంటాము.దీనికిగల కారణాలెన్నో ఉన్నప్పటికి.ప్రస్తుత పరిస్థితులలో ఒకరైతు పంటపండించాలంటే ఎంతోఖర్చుతో కూడుకొని ఉంటుంది గతంలో వలే పాడిపశువులు కనుమరుగైపోయి,వివిధ యంత్రాల సహాయంతో నేలను చదునుచేసి,

రసాయనాలతో కూడిన విత్తనాలను అధికధరతో విక్రయించి,అధిక దిగుబడి నిమిత్తం క్రిమి రసాయనిక ఎరువులు,మందులు వాడి పంటను పండించడం జరుగుతుంది.చివరికి అతివృష్టి,అనావృష్టి జరగకపోతే ఎంతోకొంత పంట దిగుబడి వచ్చినప్పటికీ దానికి సరైన గిట్టుబాటు ధర దొరకకపోవడం,పల్లెలలో సన్నకారు రైతులు మెదటి నుండి ఆర్థిక వెసులుబాటుకై దళారులపై ఆధారపడి,అధిక వడ్డీలకు అప్పులుజేసి చివరికి అప్పుల ఊబిలో చిక్కుకుపోయి నానవస్థలు పడటం జరుగుతుంది.

ఇదిలా ఉంటే మార్కెట్ లలో..!

లభించే ఆకుకూరలు,కూరగాయలు,పలురకాల ఆహారపంటలను వివిధ రసాయనికమందులు వాడి పండించడం మూలంగా అందులోని నాణ్యత, పోషకారం కోల్పోయి,వివిధ అనారోగ్య పరిస్థితులకు ఊతమిస్తుందనడంలో ఎలాంటి అవాస్తవం లేదు.చివరికి పలురకాల పండ్లను సైతం కాయలుగా ఉన్నపుడే కోసి,నిగనిగలాడే తాజారంగు రావడానికి,పండ్లుగా మారడానికి కార్బైడ్ లాంటి పదార్థాలను వాడి మార్కెట్ లోకి తెస్తే,విక్రయదారులు వాటిని తిని వివిధరోగాల బారినపడి ఇబ్బందులు ఎదురుకుంటున్నారు.గతంలో ఎలాంటి ఆధునాతనమైన వైద్యసౌకర్యాలు లేనప్పుడు సగటు మానవుడు వంద ఏండ్లకుపైగా జీవించేవారు.కానీ నేటి శాస్త్ర, సాంకేతికాభి

వృద్ధిలో ఎన్నో వైద్యాలయాలు వెలసిన బీపి,షుగర్,గుండే సంబంధిత రోగాలు మరియు క్యాన్సర్ లాంటి వ్యాధులతో జనాలు కిక్కిరిసిపోయి అర్ధాయుష్షుకే పరిమితమవుతున్నారంటే కారణం అది నేడు మనం సాధిస్తున్న ప్రగతియేనని చెప్పకతప్పని పరిస్థితి.పెద్దపెద్ద నగరాలు,

పట్టణాలకు చెందిన పెద్దపెద్ద వ్యాపారస్తులు పల్లెలకు వచ్చి వ్యవసాయ భూములను కొని లేదా కాంట్రాక్టు పద్ధతిలో కూలీల సహాయంతో ఆహారపంటలను పండించి వ్యాపారాలు చేస్తూ లాభాలను గడిస్తుంటే,

వాటిని పండించే రైతులు నగరాలకు,పట్టణాలకు వలసలు వెళ్ళి,

పొట్టకూటికై వ్యవసాయేతరపనులు చేసుకుంటూ అధిక డబ్బువెచ్చించి పండ్లు,కూరగాయలు,ఆహారధాన్యాలు కొనడం జరుగుతుంది.కేవలం ఆహారపదార్థాలే గాకుండా పాలు,నీళ్ళు,నూనెలు అన్ని కల్తీమయమై చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారనడంలో ఎలాంటి ఆశ్చర్యం అక్కర్లేదు.పాతికవయస్సు రాగానే విభిన్న వ్యాధులతో బాధపడే పరిస్థితులు దాపురించయిప్పుడు.దానికితోడు ధ్వని కాలుష్యం,వాయుకాలుష్యం,జల కాలుష్యాలతో పాటు ప్లాస్టిక్ వినియోగం,పాలిథీన్ కవర్స్ వాడకం ఎక్కువైంది.దేశంలో అభివృద్ధి అనే నెపంతో అటవీ వినాశనానికి దారితీయడం,

తయారీరంగంలో..!

ముందుకుసాగడానికి ఎన్నో కంపెనీలకు అవకాశాలిచ్చి గ్లోబల్ వార్మింగ్ కు కారకులవుతున్నారన్నది వాస్తవం.వీటన్నింటి దృష్ట్యా రాబోయేతరాల జీవనగమనం ప్రశ్నార్థకమవుతుందేమోనన్న భయం వెంటాడకమానదు.మానవ సంబంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి.మనుషులు యాంత్రిక జీవనానికి అలవాటుపడి ప్రేమ,వాత్సల్యం,అనురాగం అనే మాటలకు అర్థాలు తెలియకుండా తయారవుతున్నారు.మానవ సంబంధాలకంటే ఆర్థిక పరమైన సంబంధాలకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది.చివరికి నేరుగా పలుకరింపులే కరువై సామజిక మాధ్యమాలను వాడటం జరుగుతుంది.

పాలక వర్గానికొస్తే...!

మసిపూసి మారేడుకాయ చేసేటట్లుగా గద్దెనెక్కేదాక ఎన్నో కట్టుకథలు చెప్పి,తీరా గద్దెనెక్కాగా కథలుగానే మార్చే తంతు కొనసాగుతుంది.నిమ్న వర్గాలకు,దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలను కాపాడవలసిన ప్రభుత్వాలు లెక్కలకే పరిమితమై ఆచరణలో అంతగా ప్రాధాన్యత నివ్వకపోగా అధికార, ప్రతిపక్ష పార్టీలు

ఒకరిపైమరొకరు భూతులు తిట్టుకుంటూ కక్ష్యసాధింపు చర్యలకు ప్రాధాన్యతనిస్తూ,గోడమీద పిల్లిలా వ్యవరిస్తూ నూతనపోకడకు దారితిస్తున్నారు.

ఇదిలా ఉంటే గతంలో భారతదేశానికి..!

సంస్కృతీ,సాంప్రదాయాలలో విశిష్ట స్థానం ఉండేది.కట్టు,బొట్టు,అలంకరణ,ఆచారవ్యవహారాలు,సాంప్రదాయాలుండేవి.కానీ కాలక్రమేణా మార్పులొచ్చాయి.ఉదాహరణకు పాశ్చాత్త దేశ స్త్రీలు మనదేశాన్ని సందర్శించి నేతన్న నేచిన చీరలను ధరించి భారతీయ స్త్రీ లా తయారై సంబరపడు తుంటే,మనవాళ్ళు ఇచ్చే ప్రాధాన్యత క్రమంగా తగ్గతు పాశ్చాత్త వస్త్రాలను ధరించడానికి మక్కువ చూపుతున్నారు.

అందరు ఆలా గాకపోయిన ఎక్కువశాతంలో అలా ఉన్నారన్నది వాస్తవం.ఏ దేశానికైనా అభివృద్ధి అనేది అవసరమే కానీ అది సామాన్యమానవుని పురోగతికి దోహదపడాలి. మనం తలపెట్టే అభివృద్ధి కార్యక్రమం వలన ఏవైనా నష్టాలువాటిల్లుతున్నట్లైతే వాటిని అరికట్టడానికి ప్రణాళికయుతంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.కానీ దేశంలో ఎన్నో సమస్యలతో ప్రజానీకం,అష్టకష్టాలు పడుతున్నారు.


వారి గురించి ఆలోచించే నాయకులు..!

కరువవుతున్నారు.ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు, పేద ప్రజానీకం గురించి ఆలోచించి పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలుపరిచి వారి సుస్థిర అభివృద్ధికి పాటుపడుతూ,భవిష్యత్ తరాలకు భరోసానిచ్చే కార్యక్రమాలకు పూనుకుంటూ, మార్గదర్శకంగా ఉండాలని,అలాగే సమస్త మానవాళిలో గల మార్పులను అవగతం చేసుకోవాలని కోరుకుందాం.

## ఎమ్మెల్యే ఆదేశాలతో బీర్మల్ తాండ-మంచిప్ప రోడ్డుకు మొరం

**గాంధారి, జనవరి 11 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని భీర్మల్ తాండ నుండి మంచిప్ప గ్రామం వరకు రహదారిపై మొరం వేయడం జరిగిందని దర్బార్ మాజీ సర్పంచ్, చద్మల్ తాండ మాజీ ఉప సర్పంచ్ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ఈ మొరం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా ఈ పనులు ఎంతో ఉపయోగకరంగా మారుతాయని అన్నారు. కార్యక్రమంలో భీర్మల్ తాండ సర్పంచ్, చద్మల్ తాండ సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కస్తూర్బ పాఠశాలల ప్రత్యేక అధికారుల శిక్షణ ముగింపు



**గాంధారి, జనవరి 11 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహించిన కస్తూర్బ గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారుల శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయని గాంధారి కస్తూర్బ పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారులకు పలు అంశాలపై మూడు రోజులపాటు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ నిర్వహణ, బాధ్యతలు, విద్యార్థినుల సంక్షేమం వంటి అంశాలపై ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు.శిక్షణ ముగింపు రోజు ప్రత్యేక అధికారులు రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించడం విశేషంగా మారిందని ఆమె తెలిపారు.

## వజ్జెపల్లి తండా విడిసి కమిటీ ఎన్నిక



**సదాశివనగర్ జనవరి11 (ప్రజాజ్యోతి)**

సదాశివనగర్ మండలంలోని వజ్జపల్లి తండాలో వీడిసి కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్ గా మాలోత్ భాస్కర్, వైస్ చైర్మన్ గా దేగావత్ దేవి సింగ్, సభ్యుల కార్యవర్గాన్ని తండా నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగారాం నాయక్, తాండవాసులు పాల్గొన్నారు

## ఎల్లారెడ్డిలో ఘనంగా ఒడ్డె ఓబన్న జయంతి

**ఎల్లారెడ్డి, జనవరి-11(ప్రజా జ్యోతి)**

ఒడ్డెర కుల ఆరాధ్యదైవం ఒడ్డె ఓబన్న జయంతిని ఎల్లారెడ్డిలో ఒడ్డె సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా లక్ష్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్ సాయిరాం మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఒడ్డె ఓబన్న సైన్యాధ్యక్షుడిగా పనిచేశాడని గుర్తు చేశారు. ఆయన బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన మహావీరుడని కొనియాడారు. ఒక సంచార జాతిలో పుట్టిన ఒడ్డె ఓబన్న సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఓబన్న చిత్రపటానికి పూలమాల లేచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ గ్రామ ఉపసర్ప బోదాస్ సాయిరాం, అంజయ్య లింగమయ్య, శేఖర్, పోచయ్య, అశోక్, పోశయ్య, శ్రీనివాస్, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



# పోచారం తాండలో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభం

పెద్ద కొడప్ గల్, జనవరి 11 (ప్రజా జ్యోతి) జుక్కల్ నియోజకవర్గం, పెద్ద కొడప్గల్ మండలం పోచారం తాండలో ఈరోజు గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ యువతను క్రీడల వైపు ఆకర్షించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పెద్ద కొడప్గల్ ఎస్సై అరుణ్ కుమార్ గారు హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. చదువు--క్రీడలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అనేక జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ విధానంలో మ్యాచ్‌లు నిర్వహించి, చివరగా విజేత జట్టుకు ట్రోఫీతో పాటు మొదటి బహుమతి 25,555/- రూ, రెండవ బహుమతి 12,222/- రూపాయలు బహుమతులుగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలాజీ పటేల్ మరియు పోచారం తండా సర్పంచ్ సీతా భాయి దశరథ్, గ్రామ పెద్దలు, యువజన నాయకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# ప్రీమియర్ లీగ్ మ్యాచ్లో ఐపీఎల్ స్పాన్సర్ గౌరు నవీన్ కుమార్ టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో టీషర్ట్ లంచ్

కామారెడ్డి రూరల్ జనవరి 11 ప్రజా జ్యోతి కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఐపిఎల్ స్పాన్సర్ గౌరు నవీన్ కుమార్ టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో టీషర్ట్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ సందర్భంగా గ్రామ యువతతో పాటు క్రీడా అభిమానుల మధ్య ఉత్సవ భరిత వాతావరణం నెలకొంది ప్రీమియర్ లీగ్ మ్యాచ్ కు సంబంధించిన ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్టులను నవీన్ కుమార్ ఆవిష్కరించి ఆటగాళ్లకు అందజేశారు ఈ క్రీడల ద్వారా గ్రామ యువత దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని క్రీడలు పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు ఇస్రోజీవాడి గ్రామంలో ఇలాంటి క్రీడ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని భవిష్యత్తులో యువతకు మరిన్ని క్రీడా అవకాశాలు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని నవీన్ కుమార్ అన్నారు ప్రీమియర్ లీగ్ నిర్వహించిన కమిటీ సభ్యులు స్థానిక యువకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు క్రీడాభిమానులు యువకులు ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు



# పొందుర్తి-తలమడ్ల రైల్వే స్టేషన్ బీటీ రోడ్డు దుస్థితి



## మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్

రాజంపేట జనవరి 11 (ప్రజా జ్యోతి) రాజంపేట మండల పరిధిలోని పొందుర్తి గ్రామం నుంచి తలమడ్ల రైల్వే స్టేషన్‌కు వెళ్లే బీటీ రోడ్డు, గత ఆగస్టు మాసంలో కురిసిన భారీ వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతింది. వరదల ప్రభావంతో రోడ్డుకు ఇరువైపులా మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడగా, పలుచోట్ల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ముఖ్యంగా మూలమలుపుల వద్ద రోడ్డులు అత్యంత ప్రమాదకరంగా మారాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన పాలకవర్గం ఏర్పడినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ మార్గం ద్వారా నిత్యం రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పెరిగిందని వారు పేర్కొన్నారు. గతంలో రాజంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట, ఇలాంటి గుంతలో సైకిల్‌పై వెళ్తున్న రైతు పడి మరణించిన సంఘటనను గ్రామస్థులు గుర్తు చేస్తున్నారు. అలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పొందుర్తి--తలమడ్ల రైల్వే స్టేషన్ బీటీ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి, ప్రమాదకరమైన మలుపుల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.



# గ్రామంలో పారిశుద్ధ్య పనులు ప్రారంభించిన సర్పంచ్



బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 11 బీబీపేట మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సర్పంచ్ రామగల్ల నాగరాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులలో భాగంగా మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు బయటికి వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. అలాగే గ్రామంలోని ప్రతి ఒక్క వార్డుల్లో ఉన్న ప్రతి సమస్యను తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో మురికి కాల్వల పూడిక తీత, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులను జెసిబి సహాయంతో వేగంగా తొలగిస్తున్నాము అని తెలిపారు. ఆదివారం పలు వార్డుల్లో జరుగుతున్న పరిశుధ్య పనులను సర్పంచ్ స్వయంగా పరిశీలించారు. ఇట్టి సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ఉండాలని ఒకరు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. గ్రామ అభివృద్ధిలో తాను ఒక సైనికుడిలా పని చేస్తాను తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామగళ్ళ నాగరాజ్, ఉపసర్పంచ్ లక్ష్మి మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీ కుర్ల శ్రీనివాస్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి పార్టీకి ప్యాలాల రాములు రాజీనామా



ఎల్లారెడ్డి, జనవరి -11( ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి పట్టణ బిజెపి ముఖ్య నాయకుడు ప్యాలాల రాములు బిజెపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆదివారం మీడియాతో తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని బీజేపీ పార్టీ మండల అధ్యక్షునికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతో బిజెపి పార్టీకి అదేవిధంగా తమ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇంతకాలం సహకరించిన పార్టీకి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

రెంజల్, జనవరి 11(ప్రజాజ్యోతి): రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల ప్రధాన చౌరస్తాలో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ ఏకార్ పాషా వడ్డే ఓబన్న చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1857 సిపాయిల తిరుగుబాటు కంటే ముందే బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశ తత్వానికి వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో వడ్డే ఓబన్న చూపిన ధైర్య సాహసాలు అపూర్వమని ఆయన అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కి కుడి భుజంగా ఉండి సైన్యాన్ని నడిపించి ఆంగ్లేయులను గడగడలాడించిన ఘనత ఆయనదని అన్నారు. ఈ కార్యక్రమం లో వడ్డెర సంఘం మండలాధ్యక్షుడు ఎత్తరి సాయిలు, గిరి, మధు, చెంద్రశేఖర్, రాజు, సాయిలు, హన్మంతు, సాయిద్, సబిత్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో మేధస్సు వికాసం : మత్తు పదార్థాలకు దూరంగా యువత

**నిజామాబాద్ రూరల్ లో 10 ఎకరాలలో క్రీడ స్టేడియం మంజూరు**

**ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి**





**నిజామాబాద్ రూరల్: జనవరి, 11 (ప్రజా జ్యోతి)**

సమయపాలనతో క్రీడలు ఆడితే యువతి, యువకుల్లో మేధస్సు పెరిగి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఎంతో దోహదం చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని సిఎంసి మెడికల్ కాలేజ్ గ్రౌండ్‌లో ఆర్.పి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, విజయ సాధనకు దోహదం చేస్తాయని అన్నారు. క్రికెట్‌లో గెలుపు--ఓటములు సహజమని, ఓడినవారు తమ లోపాలను సరిదిద్దుకుని మరింత కృషితో ముందుకు సాగాలని సూచించారు. గెలిచినవారు కూడా మరిన్ని విజయాలు సాధించేలా నిరంతరం సాధన చేయాలని తెలిపారు.

**మత్తు పదార్థాలకు నో - క్రీడలకే ఓటు**

యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈగిల్ టీమ్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. మత్తు పానీయాలను మానేసి క్రీడల వైపు మళ్లితే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించే అవకాశాలు ఉంటాయని అన్నారు.

**ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో తెలంగాణ యువత ఒలింపిక్స్‌లో రాణించాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు స్థాపించారని ఎమ్మెల్యే వివరించారు. సీఎం కప్, ఇంటర్‌జోన్ టోర్నమెంట్లు, పాఠశాలలు--కాలేజీల్లో క్రీడా కార్యక్రమాల ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

**రూరల్‌లో 10 ఎకరాల క్రీడా స్టేడియం**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 10 ఎకరాల స్థలంలో క్రీడా స్టేడియం మంజూరైందని, దీని ద్వారా రూరల్ యువత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు.

ఆర్.పి. హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌కు అభినందనలుక్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించిన ఆర్.పి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను ఎమ్మెల్యే అభినందించారు. యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లించడం గొప్ప సేవగా పేర్కొన్నారు. గెలిచిన జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఓడిన జట్టుకు కూడా ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, గంగదాస్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, డిసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పోలసాని శ్రీనివాస్ శాంసన్, రామచందర్ గౌడ్, డిచ్‌పల్లి మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడు వాసుబాబు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా జ్యోతి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**నిజామాబాద్ రూరల్: జనవరి, 11 (ప్రజా జ్యోతి)**

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా జ్యోతి దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా జ్యోతి యాజమాన్యానికి, విలేకరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలికితీస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్న ప్రజా జ్యోతి పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం--ప్రజల మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా జ్యోతి పత్రిక విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు.తెలుగు పత్రిక రంగంలో ప్రజా జ్యోతి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని, ప్రజల గొంతుకగా నిలుస్తూ మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా జ్యోతి దినపత్రిక ప్రజా పక్ష పత్రిక అని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, ప్రజా జ్యోతి రూరల్ రిపోర్టర్ ములుగు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక





## జై భీమ్ నినాదంతో ముందుకు వెళ్తా

## అధ్యక్షులు పాశం చిన్న నర్సయ్య

**ఇందల్వాయి,( ప్రజా జ్యోతి న్యూస్ ) జనవరి11**

ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష,కార్యదర్శులను ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా పాశం చిన్న నర్సయ్య,ఉపాధ్యక్షులు,జెగ్గ లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి తుమ్మల నరేష్,జాయింట్ సెక్రటరీ పాశం ప్రవీణ్,కోశాధికారి కేపీ గంగారం ఆటల కార్యదర్శి పూజం వీరయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పాశం చిన్న నరసయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధన కొరకు అనునిత్యం పోరాడుతానని తెలిపారు.దళిత,బహుజనుల సమస్యల సాధనకై స్థానిక ఎమ్మెల్యే సహకారంతో సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. రాబోవు రోజులలో దళితులపైన అవాంఛనీయ ఘటనలు జరిగినట్లయితే సహించేది లేదన్నారు.గ్రామంలో ప్రస్తుతమున్న అంబేద్కర్ భవనానికి మరమ్మత్తులు,వసతులు కల్పించడం, జరుగుతుందన్నారు.తనతో పాటు సభ్యులందరూ కలిసి ఉండి ముందుకు వెళ్లేలా సహకరించాలని కోరారు. ఇందల్వాయి గ్రామ అంబేద్కర్ యువ సంఘాన్ని అభివృద్ధితోపాటు,జిల్లా స్థాయిలో మంచి పేరు ఉండేలా చూడడమే తమ కర్తవ్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సదర్ పెద్దమనిషి దాసరి అంజయ్య,తొగరి ధర్మావ్వ, గన్నారం చిన్న నరసయ్య,తొగరి నరసయ్య, సంగం మాజీ నాయకులు గంగా రాజ్యం,చంటి శంకర్,పెద్ద నరసయ్య,బుదయ్య,గంగాధర్,ప్రవీణ్,జానీ,చిన్న సాయిలు శ్రీనివాస్ వార్డ్ మెంబర్, గంగా నరసవ్వ నరసయ్య, బీఎస్పీ రూరల్ ఇంచార్జ్ నరేష్ కుమార్, మాజీ గౌరవ అధ్యక్షులు జెగ్గ రాములు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రగ్బీ అండర్--15 రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ గర్ల్స్ జట్టు ప్రతిభ

**-హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ మీట్‌లో మూడో స్థానం**

**-ఇద్దరికి నేషనల్ సెలక్షన్**

**నిజామాబాద్ రూరల్: జనవరి, 11 (ప్రజా జ్యోతి)**

హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రగ్బీ అండర్--15 గర్ల్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ జిల్లా గర్ల్స్ జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని సాధించింది. కఠినమైన పోటీల మధ్య పట్టుదలతో ఆడిన జిల్లా క్రీడాకారిణులు ఈ ఘనత సాధించి నిజామాబాద్‌కు మంచి పేరు తీసుకువచ్చారు.

ఈ రాష్ట్రస్థాయి పోటీల ఆధారంగా నేషనల్ స్థాయికి క్రీడాకారుల ఎంపిక చేపట్టగా, సిరికొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడ్పీహెచ్ఎస్ కు చెందిన పదో తరగతి విద్యార్థిని వై. లహరి నేషనల్ మీట్‌కు ఎంపికైందని పిడి అబ్బయ్య తెలిపారు. అలాగే పోచంపాడ్ గురుకుల పాఠశాల విద్యార్థి సాహర్ష్ కూడా నేషనల్ స్థాయికి సెలెక్ట్ అయ్యాడు.

నేషనల్ రగ్బీ అండర్--15 మీట్ ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జనవరి 15 నుంచి 17, 2026 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొననున్న ఈ ఇద్దరు క్రీడాకారులకు క్రీడాభిమానులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలుపుతున్నారు.

జిల్లా స్థాయి నుంచి నేషనల్ స్థాయి వరకు ఎదిగిన ఈ విజయం నిజామాబాద్ యువ క్రీడాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.



## ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

ఇందల్వాయి జనవరి 11 ( ప్రజా జ్యోతి న్యూస్)

ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని మండల కేంద్రంలో మహమూద్ అనే వ్యక్తి ఉరివేసుకొని ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలిపారు, మృతుడు మహమూద్ ఆటోడ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించే వాడని స్థానికులు తెలిపారు, ఇటీవలే కుమార్తె వివాహం అంగరంగ వైభవంగా నిర్వహించాలని గుర్తు చేశారు, ఆర్థిక ఇబ్బందుల లేక కుటుంబ తగాదాల తెలియదని పలువురు చర్చించు కుంటున్నారు, మృతుడు మహిమూధ్ చాలా కాలంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని ఎంతో ప్రణాళిక బద్ధంగా పెంచేవాడని పలు వులు గుర్తు చేసుకుంటున్నారు, కాగా మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించడం జరిగిందని ఎస్ఐ సందీప్ తెలిపారు

